రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973 9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.

సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను
శ్రీకాకుళం జిల్లాలో అమరాన్ బ్యాటరీలు, ఇంజిన్ ఆయిల్స్ అమ్మేందుకు మార్కెటింగు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ కనీస విద్యార్హత గల 25 సంవత్సరాలలోపు వయసు గలవారై ఉండాలి. మార్కెటింగ్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి గలవారు పూర్తి బయోడేటాతో అక్టోబరు 23న ఉదయం 11 గంటలకు హాజరుకావలెను.
AMARON LASTS LONG, REALLY LONG.
కిరణ్ ఆటోమొబైల్స్, పెద్దపాడు రోడ్డు, శ్రీకాకుళం-532 001,
సెల్: 9490 222 716, 94401 95005

ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు ▸ బట్టలు ▸ పిండివంటలు ▸ బుక్స్ ▸ స్వీట్స్ ▸ మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 23-10-2024
సంపుటి: 20 సంచిక: 178
పేజీలు: 4 వెల: రూ.1



- నదీతీరమంతా ఇసుకాసురులే
- బిల్లులు లేకుండానే హెవీ లోడింగ్
- కొన్నిచోట్ల ఎమ్మెల్యే కుటుంబానికి లింక్
- మరికొన్ని చోట్ల ఎమ్మెల్యేలకే ఓవర్‌టేక్
- కిల్లిపాలెం ర్యాంపు వద్దంటూ వినతి
- 900కు చేరిన నీటి టీడీఎస్

కిల్లిపాలెంలో పాతాళంలోకి తవ్విన గోతులు

# ఇసుక ఉచితం..
## షరతులు వర్తిస్తాయి!



కలుషితమైపోయిన తాగునీరు ప్రవాహం



గోపాలపెంట నుంచి బిల్లు లేకుండా ఇసుకను తీసుకెళ్తున్న లారీ

ఎక్కడి నుంచి కొలిచారో తెలియదు కానీ, మన పురాణాల్లో ఏడు అధోలోకాలు ఉన్నాయని చెబుతారు. ఇందులో అతల, వితల, సుతల, రసాతల, మహాతల, తలాతల, పాతాళ లోకాలున్నాయని యమదొంగ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ డైలాగ్ విన్నవారికి అర్థమవుతుంది. ఇందులో మిగిలిన లోకాలు ఎక్కడున్నాయని అడిగితే చెప్పలేం కానీ పాతాళం ఎక్కడుందో తెలుసుకోవాలంటే కిల్లిపాలెం ఇసుక ర్యాంపు వద్దకు వెళ్తే కనిపిస్తుంది. గత ప్రభుత్వం ఇసుకను తవ్వి, మట్టిని తీసి, రాయిని కూడా దొలిచేసి వెళ్లిపోతే, ఈ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టడం వల్ల పాతాళంలోకి తవ్వుకుపోతున్నారు.

* * *

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో రక్తపు నిల్వలు తక్కువగా ఉన్నాయని భావించి ఓ స్వచ్ఛంద సంస్థ పిలుపు మేరకు కిల్లిపాలెంలో రక్తదాన శిబిరం నిర్వహించడానికి అందరూ సిద్ధపడ్డారు. ఇందులో 150 మంది యువకులు రక్తమివ్వడానికి ముందుకొచ్చారు. శిబిరంలో పరీక్షలు ముందుగా పూర్తి చేసిన తర్వాత కేవలం ఆరుగురు మాత్రమే రక్తమివ్వడానికి అర్హులని వైద్యులు తేల్చేశారు. కారణం తెలియని కాళ్లవాపులు ఉండటంతో బహుశా కిడ్నీ వ్యాధి బారిన పడ్డారేమోనని వైద్యులు అనుమానించారు.

**సీన్ కట్ చేస్తే..** అక్కడికి రెండు రోజుల తర్వాత కిల్లిపాలెంలో బోరు నుంచి వచ్చిన నీటిని పరీక్షిస్తే పీహెచ్ లెవెల్స్ 6.93 చూపించింది. అలాగే నీటి టీడీఎస్ వాల్యూ ఒకచోట 900, మరోచోట 700 పైగా చూపించింది. వాస్తవానికి టీడీఎస్ 100 నుంచి 300 లోపు ఉండాలి. అది సముద్రం ఒడ్డునైనా సరే. కానీ 900 ఉందంటే.. నీరు ఏమేరకు కలుషితమైందో అర్థం చేసుకోవచ్చు. ఇక పీహెచ్ లెవెల్స్ కోసం ఈ కాలంలో ఎవరికీ చెప్పనవసరంలేదు. ఎందుకంటే సురక్షిత మంచినీరంటూ - మిగతా 4లో



బైరి నుంచి ఇసుక లోడుతో హైవే ఎక్కుతున్న లారీ



కిల్లిపాలెం పాత ర్యాంపునకు వెళ్తున్న ట్రాక్టర్లు

## పోలియో నిర్మూలనలో భాగస్వాములు కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిన్నారుల్లో పోలియోను నిర్మూలించాలని ఆప్తాల్మిక్ అధికారి సప్పటి వసంతరావు అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు ఇ.సత్యారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలియోవ్యాధికి గల కారణాలు, నివారణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, బిల్ అండ్ మెలిందా ఫౌండేషన్ వంటి అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచ దేశాల కృషితో పోలియో నిర్మూలనకు చేసిన కృషిని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు "పోలియో ఎండ్" చిత్రపటాన్ని విద్యార్థుల సమూహంతో ఆవిష్కరించారు. శ్రీకాకుళం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో "ప్రపంచవ్యాప్తంగా పోలియో నివారణకు రోటరీ అంతర్జాతీయ సంస్థ చేసిన కృషి" అనే అంశం పైన విద్యార్థులకు వ్యాసరచన పోటీని ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరావు, రామారావు, శ్రీనివాసరావు, అజయ్, సంతోషిమాత, సురేష్‌లు పాల్గొన్నారు.



## ప్రభుత్వ నర్సుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ ప్రభుత్వ నర్సుల జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక బుధవారం జరిగింది. ఎన్నికల అధికారులుగా డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.దామోదరరావు, డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.జానకిరామ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఒక్కో పదవికి ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికైన నూతన కమిటీ-2027 అక్టోబర్ 22వరకు మూడేళ్లపాటు కొనసాగనుందని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా పి.శాంతికుమారి, ఉపాధ్యక్షులుగా ఎస్. చిన్నమ్మి, కార్యదర్శిగా ఎల్.త్రినాదమ్మ, కోశాధికారిగా పి.సత్యవతి, కార్యవర్గసభ్యులుగా టి.బేబి, కుసుమకుమారి, టి.చంద్రకళ, పి.జగదాంబ, హెచ్ నిర్మల ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన నూతన కమిటిని ఏపీఎన్జీసీవోలు, వివిధ సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



# అభిమానుల సేవలు స్ఫూర్తినిస్తాయి

### - తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సినీనటుడు, రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు జిల్లాలో చేస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని టీడీపీ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ అన్నారు. ప్రభాస్ నగరంలోని రెడ్‌క్రాస్ భవనంలో సుమారు 30 మంది యువత గురువారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్వాతి శంకర్ మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత ఎక్కువ ఉందని, సినీనటుల అభిమానులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయని పేర్కొన్నారు. ప్రభాస్ అభిమానులు అన్నదానం, రక్తదానం, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ వంటి సేవా కార్యక్రమం నిర్వహిస్తూ ఉంటారని తెలిపారు. తమ హీరో పేరిట పూజలు చేసే అభిమానులే కాదు తమ హీరో అభిమాన సంఘాల ద్వారా సమాజంలో ఎందరో నిరుపేదలకు ఉపయోగపడుతుందని గొప్ప విషయమని తెలిపారు. అన్ని రకాల పాత్రల్లో ప్రజలను ప్రభాస్ మెప్పిస్తూ పాన్ ఇండియా స్టార్‌గా



ఎదగడం తెలుగు ప్రజలకు గర్వకారణమని చెప్పారు. ప్రభాస్ వివాదరహితుడని, ఎప్పుడూ అనవసర విషయాలపై దృష్టి సారించరని చెప్పారు. భవిష్యత్ ప్రభాస్ మరిన్ని మంచి సినిమాల్లో నటించి అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆనంద్, సెక్రటరీ శేఖర్, టీం ప్రభాస్ ఫ్యాన్స్ భాస్కరవర్మ, లక్కీ, యశ్వంత్, తులసి, తారక్, అనీల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సర్టిఫికేట్లను అందజేశారు.

# "ప్రజాదర్బార్"లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

(సత్యంన్యూస్, పాతపట్నం)

నియోజకవర్గం హిరమండలం మండలంకు చెందిన ప్రజాసమస్యలపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రజాసమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నాయన్నారు. ఈ తరుణంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజాదర్బారను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులలో భూ వివాదాలు రెవెన్యూలతో పాటు రహదారులు, విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటితోపాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లస్థలాల కోసం కూడా వినతులు



వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆయా రెవిన్యూ, విద్యుత్ శాఖ, ఆరోగ్యశాఖ, ఐటీడీఏ, ఐసిడిఎస్, మండల పరిషత్తు, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పలు శాఖల అధికారులు అనధికారులు పాల్గొన్నారు.



ప్రముఖ యూరాలజిస్ట్ & ఆంగ్రాలజిస్ట్ దుంపల హరిప్రసాద్ నగరంలో హరిప్రసాద్ కిడ్నీసెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా విశాఖకు చెందిన ప్రముఖ వైద్యులు వై.ప్రభాకరరావు, జి.శాంతారావు, టి.రమణారావు తదితరులు కలిసి అభినందిస్తున్న దృశ్యం
- సత్యంన్యూస్, శ్రీకాకుళం.

# గణిత దీప్తి పుస్తకావిష్కరణ

(సత్యంన్యూస్, కొత్తూరు)

గణితశాస్త్ర నిపుణులైన ఉపాధ్యాయులచే రూపొందించబడిన గణిత దీప్తి పుస్తకాన్ని కదుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్లె తిరుమలరావు బుధవారం ఆవిష్కరించారు. గణిత శాస్త్రోపాధ్యాయులు పడాల సునీల్, గేదెల వెంకట భాస్కరరావుల నేతృత్వంలో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుమలరావు అధ్యక్షోపన్యాసం చేశారు. గణితశాస్త్రం నాగరికతకు దర్పణం వంటిదన్నారు. తార్కిక ఆలోచనకు గణిత భావనలే కీలక భూమిక వహిస్తాయన్నారు. పాఠశాలలో నిర్వహించిన గణిత పోటీల్లో విజేతలకు పుస్తకాలను అందజేశారు. విద్యార్థులను మండలస్థాయిలో జరుగనున్న పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. గణిత శాస్త్రోపాధ్యాయులైన సునీల్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో సత్ఫలితాలకు గణిత దీప్తి ఎంతగానో దోహదపడుతుందన్నారు. గణితశాస్త్ర ఉపాధ్యాయులు భాస్కరరావు మాట్లాడుతూ గణిత పాఠ్యపుస్తకంలోని అనేక కీలక అంశాలపై ఈ పుస్తకం వివరణాత్మకంగా విశదీకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తూతిక సురేష్, దార జ్యోతి, పెయ్యల రాజశేఖరం, బండారు గాయత్రి, వల్లూరు లక్ష్మునాయుడు, శివకల శ్రీవాణి, బత్తుల వినీల, జన్ని చిన్నయ్య, ముదిల శంకరరావు, కింజరాపు నిర్మలాదేవి, బోనెల కిరణ్ కుమార్, గుంటు చంద్రం, యందవ నరేంద్ర కుమార్, రబికుమార్ మహాపాత్రో, సుస్మితా పాడి, సింగంశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

## మబ్బును చూసి ముంతలో నీళ్లు వలకబోయొద్దు

**అ**త్తారింటికి దారేది? ఆ సినిమా పవన్ కళ్యాణ్‌ను సూపర్‌స్టార్‌ను చేసింది. సగటు ప్రేక్షకులందరికీ ఆ సినిమా రెడీమేడ్‌గా నచ్చేస్తుంది. మామూలుగా సినిమాలు కోసం సన్నాయి నొక్కులు నొక్కే జనాన్ని పక్కన పెడితే అది సూపర్ హిట్ సినిమా. ఆ సినిమా ఇచ్చిన ఎలివేషన్‌తో పవన్ కళ్యాణ్ అప్పట్లో పార్టీ పెట్టి ఒక్క సీటు కూడా తీసుకోకుండా చంద్రబాబునాయుడుకి టోకున మద్దతు ఇచ్చి అతన్ని ముఖ్యమంత్రి ని చేయగలిగారు. ఇది కళ్ల ముందు సత్యం. ఆ సినిమాలో అత్త నదియా పోసాని కృష్ణమురళి దగ్గర తీసుకున్న బాకీ తీర్మానం నిమిత్తం ఒక హాల్లో సమావేశం అవుతుంది. బాకీ ఎలా తీరుస్తావని అడిగితే ఒక మల్టీ నేషనల్ కంపెనీతో డీల్ మాట్లాడుతున్నాను, అది కనుక ఓకే అయితే తన హోటల్‌కు కనీసం 40 శాతం ఆక్యుపెన్సి ఉంటుంది, దాంతో అప్పు తీర్చేస్తానంటే, ఆ సెటిల్మెంట్లో దాదాగా వచ్చిన 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృధ్వీ చాలా వెటకారంగా ముఖం పెట్టి అది అవ్వదమ్మా అంటాడు. ఆ పక్కనే ఉన్న ఏసీపీ పాత్రలో ఉన్నవాడు ఏముంది హోటల్ మీద రైడింగ్ చేసి హోటల్‌కి చెడ్డ పేరు తెస్తాం, దాంతో కంపెనీ వాళ్లు కాంట్రాక్ట్ చించేసి వెళ్లిపోతారంటూ మరింత వెటకరిస్తాడు. ఈ కింద రీల్లో జగన్ మాటలు వింటే పై సినిమాలో నదియా మాటలు గుర్తొచ్చాయి. 150 సీట్లు గెలిచినవాడు ఐదేళ్లు తిరిగే నాటికి ఇంత పాతాళంలోకి ఏం చేస్తే పడిపోయాననే సోయ ఏ మాత్రం లేకుండా చంద్రబాబు తన వందరోజుల పాలనతోనే జనానికి మొహం మొత్తేశాడు. అందుచేత మిమ్మల్ని మోటివేట్ చేస్తున్నాను, రానున్న రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అవర్ పార్టీ షుడ్ బికమ్ స్ట్రాంగెస్ట్ పార్టీ ఇన్ ద కంట్రీ అని జోకులేస్తుంటే ఎవరికైనా నవ్వు రావడం సహజం. ఇలాంటి విషయాల్లో స్పందించకుండా ఉండలేం. జాతీయ పార్టీలే ప్రాంతీయ పార్టీలతో పొత్తు కోసం అర్రులు చాస్తున్న ఈ రోజుల్లో ఒక ప్రాంతీయ పార్టీ దేశంలోనే స్ట్రాంగెస్ట్‌గా నిలబడటమనేది కల. ఒకవేళ బలమైన పార్టీగా ఎదిగినా జాతీయ పార్టీ దాన్ని బతకనివ్వదు. ప్రాంతీయవాదంతో మొదలైన శివసేనను మహారాష్ట్రలో ఏం చేశారో మనకు తెలుసు. అలా అని ఇప్పుడు మహారాష్ట్రలో బీజేపీ ఎన్నికల సమయంలో ఎలా తిప్పలు పడుతుందో కూడా తెలుసుకోవాలి. బీజేపీ నవీ ముంబయ్ జిల్లా అధ్యక్షుడు సందీప్ నాయక్ పార్టీకి రాజీనామా చేసి శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీలో చేరారు. సందీప్ తండ్రి గణేష్ నాయక్‌కు నవీ ముంబయ్‌లో ఐరోలీ అసెంబ్లీ సీటును బీజేపీ కేటాయించింది. మరో బీజేపీ ఎంపీ నారాయణ్ రాణే కుమారుడు నీలేష్ రాణే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే పార్టీలో చేరి కుడాల్ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నానని చెబుతున్నారు. జార్ఖండ్‌లో బీజేపీకి హేమంత్ సోరెన్ గట్టి షాకే ఇచ్చారు బీజేపీ మాజీ ఎమ్మెల్యే లూయిస్ మారండీ, కునాల్ సారంగి, లక్ష్మణ్ తండు జేఎంఎంలో చేరారు. మూడుసార్లు గతంలో బీజేపీ నుంచి గెలిచిన కేదార్ హజ్రా కూడా జేఎంఎంలో చేరిపోయారు. తెలంగాణలో జగిత్యాల కాంగ్రెస్ సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పార్టీ వీడుతున్నట్టు ప్రకటించారు. మన రాష్ట్రంలో చంద్రబాబు మీద గెలిచివస్తే మంత్రిని చేస్తానని జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన కుప్పం వైకాపా ఇన్‌ఛార్జి భరత్ గత కొద్ది రోజులుగా కనిపించడంలేదని స్వయంగా సామాజిక మాధ్యమాల్లోనే పోస్టులు పెట్టారు. హర్యానాలో ఓటమిపాలైన తర్వాత కాంగ్రెస్‌తో కొనసాగాలా? లేదా స్వతంత్రంగానే బరిలో దిగాలా? అన్న మీమాంసలో ఐఎన్‌డీఐఏ కూటమిలో పార్టీలు ఉన్నాయి. ఏ క్షణంలోనైనా ఇందులో చీలిక రావచ్చు. మహారాష్ట్రలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మీదే ఆయన మేనల్లుడు యోగేంద్ర పవార్‌ను పోటీకి నిలబెట్టడానికి సిన్నద్ధం చేశారు. ఎన్‌సీపీలో శరద్ పవార్, ఆయన సోదరుడు అజిత్ పవార్ వర్గాలు రెండు ఉన్నాయి. ఒక ప్రాంతీయ పార్టీ నిలదొక్కుకోవడమే కష్టం. అందులోనూ జాతీయ స్థాయిలో స్ట్రాంగెస్ట్ పార్టీగా ఎదగడమంటే మహా కష్టం. రెండుసార్లు వరుసగా గెలిచిన తెలంగాణ ఉద్యమ పార్టీ టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్ అయిన తర్వాత ఎలా మారిందో చూశాము. చంద్రబాబు కూటమి ఇంకా ఐదేళ్లు అధికారంలో ఉంటుంది. కేవలం వంద రోజుల పాలన చూసి చంద్రబాబు ఫెయిలయ్యారని, ఇక రాబోయేది తమ ప్రభుత్వమేనని జగన్మోహన్‌రెడ్డి ఊహించుకుంటే మబ్బును చూసి ముంతలో నీరు ఒలకబోసుకోవడమే. ఎందుకంటే.. జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నారన్న సంకేతాలు రాగానే మోడీ–పవన్–నేను.. మా త్రయంతో రాష్ట్రం మున్ముందుకే అంటూ మరోసారి బీజేపీతో ఉన్న బంధాన్ని మంగళవారం డ్రోన్ సమ్మిట్‌లో చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీ రామారావు నుంచి పార్టీ చంద్రబాబు చేతిలోకి వచ్చిన తర్వాత ఆ మరుసటి ఎన్నికల్లో వాస్తవానికి చంద్రబాబు ఓడిపోవాలి. కానీ మళ్లీ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చారు. ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత ఆ సానుభూతి పవనాల్లో 2014లో వైకాపా గెలవాలి. కానీ చంద్రబాబే గెలిచారు. చంద్రబాబును తక్కువ అంచనా వేసి, కేవలం ఆయన మీద విరక్తే తనను గెలిపిస్తుందనుకోవడం వైకాపా అవివేకం.

## విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులు మాదక ద్రవ్యాల బారినపడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ఒకటో పట్టణ ఎస్పై హరికృష్ణ విద్యార్థులకు సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చైతన్య కళాశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్లలో పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సైలు హరికృష్ణ, కృష్ణారావులు మాట్లాడుతూ పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ గురించి, రిసెప్షన్, లాకప్ రూమ్ స్టేషన్ రైటర్, రికార్డుల నిర్వహణ, టెలికాన్ఫరెన్స్, ఆన్ లైన్ ఎఫ్ఐఆర్, పార్టు మ్యాప్, పిస్టల్, ఇతర ఆయుధాల గురించి వివరించారు. మైనర్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. పోలీస్ డాగ్ రాణిని తెచ్చి గంజాయిని కలిగి ఉంటే ఏ విధంగా ఈ ట్రైనీ డాగ్ పసిగడుతుందో విద్యార్థులకు చేయించి చూపించారు. విద్యార్థులు యూనిఫాం లేని రక్షకభటులుగా పనిచేయాలని, వారి పరిసరాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాల గురించి పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్య జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రౌతు శ్రీనివాసరావు, జూనియర్ లెక్చరర్లు చినరాజు, నీలిమ, ఏఎస్ఐ రాంబాబు, రైటర్ బొమ్మాళి రవికుమార్, అప్పల నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## బొబ్బిలి యుద్ధం నుంచి సంస్థానాధీశులకు నమ్మకమైంది కిమిడి వంశం



(సత్యంన్యూస్, రాజాం)

రాజకీయాల్లో ప్రఖ్యాతమైన రేగిడికి చెందిన కిమిడివారు బొబ్బిలి యుద్ధకాలం నుంచి బొబ్బిలి రాజులకు ఆత్మీయులు. ఈ విషయాన్ని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకట్రావు తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రాత్రి తనను కలుసుకున్న రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథానికి తెలియజేశారు. రాజాం చరిత్ర రచన పూర్తయి, ముద్రణకు సిద్ధమవుతున్న సందర్భంలో రచయిత రంగనాథం చారిత్రక విశేషాలను తెలుసుకోవడానికి ఆయనను కలిశారు. తరతరాలుగా తమ పూర్వులు బొబ్బిలి కోటకు వెళ్లి వచ్చేవారని, 200 ఎకరాలకు భూస్వాములని రంగనాథానికి కళా వెంకట్రావు వివరించారు. రేగిడి గ్రామానికి గ్రామాధికారులుగా, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్పంచులుగా తన తండ్రి, అన్నదమ్ములు పని చేసేవారని, తెలుగుదేశం ఏర్పాటు తర్వాత అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు తాను ఆ పార్టీలో చేరానని అన్నారు. తన ఎలిమెంటరీ చదువు స్వగ్రామం రేగిడిలో జరిగిందని, ఉన్నత పాఠశాల చదువు పాలకొండ ప్రభుత్వ పాఠశాలలో, కళాశాల విద్యాభ్యాసం విశాఖపట్నం మిసెస్ ఏ.వి.ఎన్ కళాశాలలో పూర్తి చేశానని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఎల్. చదువుతున్న రోజుల్లోనే ఇప్పటి ఈ కళింగాంధ్ర ప్రాంతపు రాజకీయ నాయకులతో స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయని, తనకున్న బంధుత్వం, ప్రజా సంబంధాల వల్ల ఎన్టీ రామారావు ఉణుకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెటిచ్చారని వివరించారు. అనంతర కాలంలో, వివిధ పరిస్థితుల్లో మార్పులు చేర్పులు వచ్చినా, ఆరుసార్లు ఎమ్మెల్యే గాను, హోంమంత్రి గాను, ఇతర మంత్రి పదవులలోను, టీటీడీ చైర్మన్‌గా పని చేశానని చెప్పారు. రాజ్యసభ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా, చాలా పదవులు ఆ పార్టీ వల్ల దక్కాయని, ఎన్టీ రామారావుకు, చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ తరపున, ప్రభుత్వం తరపున తాను అధికారంలో ఉన్నా, లేకపోయినా ఈ రాజాం ప్రాంత అభివృద్ధికి చేసిన కృషిని ఆయన వివరించారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టు నిర్మాణానికి, ఎచ్చెర్లలో ట్రిపుల్ ఐటీ, పీజీ సెంటర్ ఏర్పాటులో తన కృషి చాలా ఉందని, పొందూరు ఖాదీ సంస్థకు ఎంపీ ల్యాడ్స్ కింద అవసరమైన నిధులు మంజూరు చేశామని చెప్పారు. రాజాంలో కోర్టుభవనాలతో పాటు, అనేక ప్రభుత్వ భవనాలు తమ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. పాలకొండలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటుకు, భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మించడంలో తన కృషి ఉందని చెబుతూ తోటపల్లి, మడ్డువలస నిర్మాణాల తర్వాతనే ఈ ప్రాంతంలో వలసలు ఆగాయని చెప్పారు. సుమారు రెండున్నర గంటల సుదీర్ఘ సంభాషణలో ఎన్నో రాజకీయ, చారిత్రక, సామాజిక, ఆర్థిక అంశాలను రంగనాథంతో కళా వెంకట్రావు మనసు విప్పి మాట్లాడారు. ఈ సమావేశంలో కొల్లూరు తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**- విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతిఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. జిల్లాకు వచ్చిన సందర్భంగా ఓ పత్రిక ప్రకటన జారీ చేశారు. సైబర్ మోసగాళ్లు సాధారణంగా 10 రకాలుగా మోసగిస్తారని, జాగ్రత్తగా ఉండాలని, మోసగాళ్లు అన్ని వయస్సుల వారిని లక్ష్యం చేస్తారని, అయితే మధ్య వయసువారు, వృద్ధులు సులభంగా బలవుతున్నారన్నారు.

మోసగాళ్లు ట్రాయ్‌లో పనిచేస్తున్నామని, మీ మొబైల్ నెంబర్ అక్రమ కార్యకలాపాలకు సంబంధించినదని, సేవలు నిలిపివేస్తామని చెబుతారు. వాస్తవంగా ట్రాయ్ సేవలను నిలిపివేయదు. టెలికాం కంపెనీలు నిలిపివేస్తాయన్నది ప్రజలు గమనించాలన్నారు. అలాగే సైబర్ మోసగాళ్లు ఒక ప్యార్సల్ అక్రమ పదార్థాలు, వస్తువులతో ఆర్డర్ పెట్టుబడిందని, చెల్లింపు చేయాలని డిమాండ్ చేస్తారు. అలాంటి ఫోన్‌కాల్స్‌కు రెస్పాండ్ కాకుండా ఆయా నెంబర్లపై రిపోర్ట్ చేయలన్నారు.

తప్పుడు పోలీస్ అధికారులు డిజిటల్ అరెస్ట్ లేదా ఆన్లైన్ విచారణ పేరుతో బెదిరిస్తారని, పోలీసులు డిజిటల్ అరెస్టులు లేదా అన్లైన్ విచారణలు నిర్వహించరనే విషయాన్ని గుర్తించాలన్నారు. బంధువును అరెస్టు చేస్తారని, డబ్బు చెల్లించమని డిమాండ్ చేస్తారని, మోసగాళ్లు పన్ను అధికారులని నటిస్తూ బ్యాంక్ వివరాలను అడుగుతారని, పన్ను శాఖ వద్ద బ్యాంక్ వివరాలు ఉంటాయన్నారు. చర్య తీసుకునే ముందు ప్రతీ సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని, అనుమా నాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని, లావాదేవీలను బ్యాంకులతో ధృవీకరించుకోవాలని, అనుమానాస్పద కాల్స్/ నంబర్లను రిపోర్ట్ చేయాలని, అధిక లాభాల పథకాల పట్ల జాగ్రత్త వహించాలని, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 సంప్రదించాలని సూచించారు.



## హీరో చేతిలో తన్నులు తినే అమాయక ఫైటర్స్..

# బేసిక్ రూల్స్!

1. హీరోని ఎప్పుడూ గుంపుగా అటాక్ చేయకూడదు. ఒకరి తర్వాత మరొకరు మాత్రమే అటాక్ చేయాలి.. తమ బ్యాచ్ లో ఒకడిని హీరో కొడుతుంటే మిగిలిన వాళ్ళు గుడ్లప్పగించి చూస్తూ ఉండాలి..

2. ఫైట్ స్టార్ట్ అయిన వెంటనే ఫైటర్లలో ఒకడు రేయ్ అని అరుస్తూ ఏదొక ఆయుధంతో అటాక్ చేయడానికి హీరోపైకి దూసుకురావాలి. హీరో వాడిని కొట్టగానే మిగిలిన ఫైటర్స్ వాడిని కొట్టిన విధానం చూసి భయపడాలి.

3. ఒక ఫైటర్ ను కొట్టే పనిలో హీరో బిజీగా ఉంటే వేరే ఫైటర్ వెయిట్ చేయాలి తప్ప అటాక్ చేయకూడదు. ఒకవేళ వెనకనుండి అటాక్ చేయాల్సి వస్తే 'రేయ్' అని అరుస్తూ వెనకనుండి అటాక్ చేస్తున్నా అని హింట్ ఇవ్వాలి.. అప్పుడు హీరో అలర్ట్ అయి వాడిని కొట్టాలి.

4. ఒకేసారి హీరో నలుగురైదుగురు ఫైటర్స్‌ని కొట్టాల్సి వస్తే ఎవడో ఒక ఫైటర్ హీరోని తనపై మోస్తూ అలా కొట్టేందుకు హెల్ప్ చేయాలి.

5. హీరో కొట్టే పిడి గుద్దులకు పక్కనే ఉన్న బెంచీలు, గ్లాసులపై పడి వాటిని ఖచ్చితంగా డ్యామేజ్ చేయాలి తప్ప సేఫ్‌గా కిందపడడం ఫైట్స్‌లో నిషిద్ధం...

6. ఒకవేళ హీరో ఫలానా విధంగా ఫైట్ చేయాలని ఛాలెంజ్ చేస్తే అలా నేనెందుకు చేయాలని ప్రశ్నలు వేయకుండా గుడ్డిగా హీరో చెప్పిన టాస్క్ పూర్తి చేసేందుకు ఫైటర్స్ ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు హీరోయిన్ ని టచ్ చేస్తే మీదే అని హీరో ఛాలెంజ్ చేస్తే ఫైటర్స్ హీరోయిన్ ని టచ్ చేయడానికి పోటీ పడి తన్నులు తినాలి తప్ప హీరోని అటాక్ చేయడానికి ట్రై చేయకూడదు. ఇలాంటి కోవలోకే కళ్ళజోడు టచ్ చేసే ఫైట్, కాళ్ళు కిందపెట్టకుండా విలన్స్ ని దుమ్ము దులిపే రకరకాల ఫైట్స్ వస్తాయి..

7. పాత మూవీస్ లో అయితే హీరో ఏ వెహికల్ తో జీవనాధారం పొందితే ఆ వెహికల్ తో ఖచ్చితంగా ఫైట్ చేయాలి. ఆ ఫైట్ లో తప్పనిసరిగా ఆ వెహికల్ తో ఫైటర్స్ తన్నులు తినాలి.. ఉదాహరణకు హీరో రిక్షా తొక్కితే రిక్షా ఫైట్, ఆటో నడిపితే ఆటో ఫైట్, సైకిల్ నడిపితే సైకిల్ ఫైట్ కామన్ గా ఉంటాయి.. ఒకవేళ జంతువుల సాయం తీసుకుంటే వాటితో కూడా తన్నులు తినాలి.. ఉదాహరణకు గుర్రం, పొట్టేలు, కుక్క, కోతి ఇలా ఏ జంతువును హీరో పెంచినా వాటితో ఫైట్ కామన్..

8. టాస్క్‌లో భాగంగా హీరోకి ఫైట్ లో కళ్ళు కనబడకపోతే రేయ్ అని అరవడమో లేదా ఏదొక చప్పుడు చేసి హీరోకి మేము ఫలానా దిశలో వస్తున్నామని హింట్ ఇవ్వడమో చేసి తన్నులు తినాలి.

9. ఒక ఫైటర్‌ని హీరో కొట్టి విసిరేస్తే వాడు వెళ్లి ఖచ్చితంగా ఓ ఐదారుగురు ఫైటర్స్‌పై పడి వారిని కూడా కింద పడేయాలి తప్ప ఉట్టిగా కింద పడకూడదు.

10. హీరో దెబ్బలకి ఒళ్ళంతా హూనమై బోన్స్ విరిగినా సైలెంట్ గా వెళ్లిపోవాలి తప్ప హీరోపై ఎలాంటి కేసులు పెట్టకూడదు.

11. ఫైటర్స్ ఆవేశంగా హీరోని అటాక్ చేయడానికి వస్తున్నప్పుడు హీరో ఆగండి అంటే ఆగిపోవాలి. ఫైట్ స్టార్టింగ్ లో హీరో ఒకడిని కొట్టి చెప్పే పవర్ ఫుల్ డైలాగ్స్ వినాలి తప్ప ఆ టైమ్ లో హీరోను ఏ ఒక్క ఫైటర్ అటాక్ చేయకూడదు..

12. హీరో కొట్టినప్పుడు ఫైటర్స్ స్లో మోషన్‌లో పడేందుకు ట్రై చేయాలి.. ఒకోసారి హీరో నడుస్తున్నప్పుడు హీరోతో పాటు గాల్లో ట్రావెల్ చేయాలి..

## ఎర్ర చీరలో నేహా హై గ్లామర్ డోస్

తెలుగు చిత్రసీమలో గ్లామర్ లుక్స్‌తో ఆకట్టుకునే నటి నేహా శెట్టి, ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోషూట్‌తో మరోసారి అభిమానులను మంత్ర ముగ్ధలను చేసింది. ఎర్ర చీరలో రిచ్‌లుక్‌తో అద్భుతంగా మెరిసిపోతూ, తన సొగసైన ఫోజులతో నేహా ప్రత్యేకంగా ఆకర్షించింది. "Just me, a little red and a lot of attitude" అంటూ తన గ్లామర్‌కి కొత్త డెఫినిషన్ ఇచ్చింది. ఈ ఫోటోషూట్‌లో నేహా రెడ్ కలర్ చీరతో తన యాటిట్యూడ్‌ను మరింత హైలైట్ చేసింది. ఆమె ధరించిన మేకప్, జువెలరీ, హెయిర్ స్టైలింగ్ అన్నీ ఆమె అందాన్ని మరింత మెరుగు పరచాయి. మేకప్ ఆర్టిస్ట్ జాస్మిన్, హెయిర్ స్టైలిస్ట్ క్రాఫ్టెడ్ హెయిర్ బై హర్, ఫోటోగ్రాఫర్ అరిఫ్ మిన్వాజ్ చేసిన ఈ అద్భుతమైన కాంబినేషన్‌తో నేహా లుక్ స్టన్నింగ్‌గా ఉంది. నేహా తన కెరీర్‌లోనే గ్లామర్‌కి ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది. 'డీజే టిల్లు'లో రాధిక పాత్రలో ఆమె నటన మాత్రమే కాకుండా ఆమె గ్లామర్ కూడా సినిమాకు పాజిటివ్ రివ్యూస్ తీసుకురావడానికి తోడ్పడింది. ఆ సినిమా తర్వాత ఆమె 'బెదుర్లంక 2012', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి చిత్రాలలో కూడా నటించి మెప్పించింది. సినిమాలలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నేహా, సోషల్ మీడియాలో కూడా తన ఫ్యాషన్ సెన్స్‌తో ఫాలోవర్స్‌ను సంపాదిస్తోంది. తాజా ఫోటో షూట్ లో ఆమె చేసిన స్టన్నింగ్ లుక్ కి సోషల్ మీడియాలో విపరీతమైన స్పందన లభిస్తోంది. వైబ్రెంట్ ఎర్ర చీర ధరించి, బరువైన మేకప్ తో కాకుండా సింపుల్ జ్యూయెలరీతో నేహా చాలా హుందాగా కనిపించింది. ఈ ఫోటో షూట్‌లో నేహా ఫ్యాన్స్ ఆమె గ్లామర్‌ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. "ఎర్ర చీరలో చాలా బావుంది", "ఇంకెప్పుడు ఇలాంటి గ్లామర్ రోల్ చూడాలి" అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. **– తుపాకి.కామ్ సౌజన్యంతో...**





# ఎప్పుడూ క్రికెటర్సేనా..

మన దేశంలో సినీతారలకు, క్రికెటర్లకు ఫ్యాన్స్ ఎక్కువ. ఎక్కువ అమ్ముడుపోయే సబ్జెక్ట్స్ ఏవైనా ఉన్నాయంటే కూడా అవే. ఈ రెండు రంగాలపై ఎంతో కొంత అభిమానం కలిగి ఉండేవారితో పాటు వీరాభిమానులు, సోషల్ మీడియాలో ఒకరిపై ఇంకొకరు దుమ్మెత్తిపోసుకునేవారు తెల్లాలి లేస్తే కనిపిస్తూనే ఉన్నారు. సర్వసాధారణంగా ఎంతోకొంత మక్కువతో కొందరిని అభిమానించేవారినీ ఇక అభిమానం వెర్రితలలు వేసి పీక్‌కు వెళ్లినవారిని.. ఇలా ఈ రెండు రకాలనూ కాస్సేపు పక్కన పెడితే.. మరొక వీరాభిమానిని మాత్రం మనం పరిచయం చేసుకోవాల్సిందే. ఔను.. ఎంతసేపూ క్రికెటర్స్, సెలక్టర్స్, అంపైర్స్, బీసీసీఐ చైర్మన్స్, ఐపీఎల్ జట్ల బ్రాండ్ అంబాసిడర్స్ గురించేనా మాట్లాడుకోవడం? అందుకే.. ఇప్పుడో సగటు అభిమాని గురించి చెప్పుకుందాం. ఆయనే ఎస్.రాందాస్.

# ఓ 103 ఏళ్ల కుర్ర అభిమాని కథా చదివేయొచ్చు!

ఎస్.రాందాస్ చెన్నై సూపర్ కింగ్స్ సూపర్ ఫ్యాన్. ఎంతగా అంటే.. చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్‌లో ఆట మొదలెట్టిన నాటినుంచి ఇప్పటివరకూ ఆ జట్టు ఎక్కడ ఏ జట్టుతో ఏ స్టేడియంలో మ్యాచ్ ఆడినా అక్కడ రాందాస్ వాలిపోవాల్సిందే.

మరి రాందాస్ వయస్సెంతనుకుంటున్నారు? ఎక్కడ మ్యాచ్ జరిగినా అక్కడ రాందాస్ ఉంటున్నాడంటే.. బహుశ కుర్రాడై ఉంటాడు.. పిచ్చి పీక్‌కు ఎక్కి వాలిపోతున్నాడేమో అనిపిస్తుందా? కానీ, రాందాస్ వయస్సే ఇక్కడ ఆశ్చర్యపర్చే అంశం. సీఎస్కే స్పెషల్ అయిన ధోనీ ఐపీఎల్‌లో సెంచరీ కొట్టలేదుగానీ.. రాందాస్ మాత్రం వయస్సులో సెంచరీ కొట్టేశాడు. రాందాస్ వయస్సు అక్షరాలా ఇప్పుడు 103 ఏళ్లు మరి. 103 ఏళ్ల వయస్సులోనూ రాందాస్ సీఎస్కే మ్యాచ్‌ను ఎంజాయ్ చేస్తున్న ఓ వీడియో అప్పట్లో వైరల్‌గా మారడంతో ఈ ఫ్యాన్ కథ వెలుగులోకొచ్చింది.

ఐపీఎల్ ప్రారంభమైన నాటినుంచి ఐదుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్‌ను ప్రతీ మ్యాచులోనూ రాందాస్ అనుసరిస్తూనే ఉన్నాడు. రాందాస్ షుగర్ పేషంట్ అయినప్పటికీ.. సీఎస్కే మ్యాచ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ ముందే టిక్కెట్స్ బుక్ చేయించుకుని స్టేడియంలో వాలిపోతాడు. అలా ఒక్క ఐపీఎల్ గేమ్‌ను కూడా మిస్ కాకుండా క్రికెట్ స్టార్లను మించిన ఆసక్తిని కనబర్చేలా 103 ఏళ్ల వయస్సులో ఓ కొత్త రికార్డును సృష్టించాడు ఈ వృద్ధ అభిమాని.

1920లో కోయంబత్తూర్‌లోని ఉడుమలైపేట్టైలో జన్మించిన రాందాస్ పీయూసీ పూర్తి చేసి ఎయిర్ రైట్ ప్రికాషన్ అనే బ్రిటీష్ మిలటరీ ఆర్మీలోని ఓ యూనిట్‌లో పనిచేశాడు. తిరుచ్చిరాపల్లిలో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన రాందాస్.. నాటి నుంచీ తానూ చురుకుగా క్రికెట్ ఆడేవాడు. అలా ఆటపై మక్కువేర్పడి.. అది కాస్తా ధోనీపైకి, అలా అలా చెన్నై సూపర్ కింగ్స్‌పై మక్కువను పెంచి 103 ఏళ్లైనా ఏజ్ అంటే జస్ట్ నంబర్ మాత్రమేనన్నంత అభిమానాన్ని చాటిచెబుతూ క్రికెటర్లు, సెలబ్రిటీల వలే ఓ అభిమాని కూడా వార్తల్లో పతాకశీర్షికలకు ఎక్కగలడని నిరూపించాడు.

తాను 103 ఏళ్ల వయస్సున్న యువకుణ్నేనంటారు రాందాస్. పైగా సీఎస్కే జర్సీ ధరించి మరీ స్టేడియంలో ఓవైపు క్రికెట్ చూడాలా, లేక వచ్చిన వీక్షకులు రాందాస్‌ను చూడాలా అన్నట్టుగా అలరిస్తుంటాడు. ఈమధ్య జరిగిన సీఎస్కే మ్యాచులో రాందాస్ కుమారుడు పక్కనే కూర్చుని తన తండ్రి ఇంకా ఎలాంటి మెమరీ కలిగి ఉన్నాడు. ఆటగాళ్లనెలా గుర్తుపడతాడో పక్కనున్న వాళ్లకు చూపించే క్రమంలో ధోనీ, రవీంద్ర జడేజా, సురేష్ రైనా ఉన్న ఫోటోను చూపించి ఎవరెవరో గుర్తు పట్టమంటే ఠకీమని చెప్పేశాడంటే. ఆయన మైండ్ క్రికెట్‌పై ఎంత ధ్యాసగా ఉందో అర్థం చేసుకోవచ్చు.







తన తండ్రి వల్ల తమకూ క్రికెట్ పై ఆసక్తి పెరిగిందంటాడు రాందాస్ కొడుకు. తనతో పాటు.. తన ఫ్రెండ్ సర్కిల్‌కూ క్రికెట్‌పై అమితాసక్తి నెలకొనడానికి తన తండ్రే కారణమంటాడు. ఐపీఎల్ ప్రారంభమైన నాటి నుంచీ సీఎస్కే ప్రతీ మ్యాచ్ చూస్తున్న తన తండ్రి మొత్తం మ్యాచ్ చూడగలడా ఈ వయస్సులో అని అనుకుంటామని, కానీ మనకు కాస్త బోర్ కొట్టినా తన తండ్రి రాందాస్ మాత్రం మొదటి బాల్ ప్రారంభమైనప్పటి నుంచీ మ్యాచ్ ముగిసే చివరి బాల్ వరకూ చూస్తాడంటాడతను. ఢిల్లీలో సీఎస్కే మ్యాచ్ జరిగినప్పుడు.. అంత దూరం ఈ వయస్సులో వెళ్లగలరా.. ఆ మ్యాచ్ ఇప్పుడవసరమా అంటే తగ్గేదేలే అంటాడని.. అవసరమైతే తాను నడుచుకుంటూ వెళ్లైనా ఆ మ్యాచ్ చూసొస్తానంటాడని ఆయన కుమారుడు చెప్పే మాట.

అంతేకాదు.. ధోనీ మనల్నేమైనా పిల్చాడా, ఇప్పుడెళ్లి ఆయన్ని చూడాలా, మ్యాచ్ అవసరమా అన్నట్టుగా మాట్లాడితే.. ఏస్, కచ్చితంగా వెళ్లాల్సిందే. వెళ్లి చూడాల్సిందే. ధోనీ ఎప్పుడు పిలిస్తే అప్పుడు వాలిపోవాల్సిందే. ఆయన గ్రౌండ్‌లో అడుగుపెట్టడమే పిలవడం లాంటిదంటూ తన అభిమానాన్ని చాటేస్తూ తన కొడుకు మ్యాచ్‌కు తీసుకెళ్లక తప్పని పరిస్థితుల్లో రాందాస్ అభిమానం 103 ఏళ్ల వయస్సులోనూ కొనసాగుతూనే ఉండటం కొసమెరుపు.

**- రమణ కొంటికర్ల**

## 'దానా' పట్ల అప్రమత్తంగా ఉండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాను పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. తుపాను తీవ్రత నేపథ్యంలో ఈ నెల 24 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురవనున్నాయని, వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని చెప్పారు. గండ్లు పడే అవకాశమున్న చెరువులు, కరకట్టలు, కాలువలపై నిఘా ఉంచి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి అవసరం మేరకు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వైద్య,రెవెన్యూ, పోలీసుశాఖలతో పాటు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంచాలని చెప్పారు.

## మాదకద్రవ్యాలు పూర్తిస్థాయిలో అరికట్టాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన పోలాకి, నరసన్నపేట పోలీసు స్టేషన్లు, నరసన్నపేట సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా రేంజ్ డీఐజీకి పోలీసు సిబ్బంది గౌరవ వందన సమర్పించారు. అనంతరం ఆయన ప్రతి పోలీస్‌స్టేషన్లో పచ్చదనానికి ప్రతికగా మొక్కలు నాటారు. ఆయా పోలీస్ స్టేషను పరిసరాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రేంజ్ డీఐజీ వెంట ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి, నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోలాకి ఎస్సై రంజిత్ కుమార్, సారవకోట ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## వైకాపాకు వాసిరెడ్డి పద్మ రాజీనామా



**గుంటూరు:** వైకాపాకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ మహిళా నేత, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు ఆమె దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో వైకాపాను ఆమె వీడారు. రాజీనామా లేఖను వైకాపా కార్యాలయానికి వాసిరెడ్డి పద్మ పంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా అధ్యక్షుడు జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

**'గుడ్‌బుక్' పేరుతో మరోసారి జగన్ మోసం**

వైకాపా పాలనలో మాజీ సీఎం జగన్ ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశారని, ప్రభుత్వ మద్యం పేరిట పేద ప్రజలను దోచుకున్నారని, ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, వైకాపాలో మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో అవమానాలు ఎదురైనా క్రమశిక్షణ కలిగిన నేతగా పార్టీ కోసం పనిచేశానని, మహిళలపై జరుగుతున్న దాడులను వైకాపా రాజకీయంగా వాడుకోవడం బాధాకరమని, గత ప్రభుత్వం హయాంలోనూ అనేక దాడులు జరిగాయన్నారు. సీఎం హోదాలో జగన్ ఎప్పుడూ బాధితులను పరామర్శించలేదని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లినా కనీస చర్యలు తీసుకోలేదని, పార్టీని నడిపించడంలో, పాలనలో జగన్‌కు బాధ్యత లేదన్నారు. నియంతృత్వ ధోరణిని ప్రజలు మెచ్చుకోరని ఎన్నికల తీర్పు స్పష్టం చేసింది. జగన్ 'గుడ్‌బుక్' పేరుతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారని, నాయకులు, కార్యకర్తల కోసం ఉండాల్సింది 'గుడ్ బుక్' కాదు 'గుండె బుక్" అని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు.

## 25న తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాదర్బార్

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)



ఈనెల 25న గార తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వినతుల స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. గార మండలానికి చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమానికి గార మండలానికి సంబంధించిన అధికారులందరూ హాజరు అవుతారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## అభయం ఫుడ్‌బ్యాంక్‌కి 800 రోజులు

(సత్యంన్యూస్, టెక్కలి)

నిరాశ్రయుల ఆకలి తీరుస్తున్న అభయం ఫుడ్‌బ్యాంక్ స్థాపించి నేటికి 800రోజులు పూర్తి చేసుకుందని అభయం యువజన సేవాసంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. రెబల్‌స్టార్ ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం అంధవరపు కిషోర్ అన్నదానం చేసినట్టు తెలిపారు. ఫుడ్‌బ్యాంక్ దాతల సహకారంతో ప్రతిరోజు రెండుపూటలు 50-60మందికి అన్నదానం చేస్తున్నామన్నారు. 800 రోజుల అన్నదానంకు దాతల సహకారంతో సుమారు రూ.19లక్షల ఖర్చు చేసినట్లు తెలిపారు. మరికొంతమంది దాతలు ముందుకు వస్తే ఎటువంటి ఆసరా లేని వృద్ధులకు, ఇంటి వద్దకే అన్నం పాకెట్స్ పంపించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అంధవరపు కిషోర్ సంఘం సభ్యులు ఎన్.సింహాచలం, అద్దాల వీరభద్రాచారి, మున్న, కంచరాన రాజు పాల్గొన్నారు.



## మహాసభలు జయప్రదం చేయండి



(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

పలాసలో జరిగే సీపీఎం 18వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులులు కె.మోహనరావు పిలుపునిచ్చారు. సోంపేట మండలం పాలవలసలో పాలవలస శాఖ మహాసభలు సీపీఎం సోంపేట మండల నాయకులు సంగారు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగాయి. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం పార్టీ జిల్లా మహాసభలు నవంబరు 9, 10 తేదీల్లో పలాసలో జరగనున్నాయని, 9న ర్యాలీ, బహిరంగ సభ జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు ఎ.షణ్ముఖరావు, నిమ్మన మోహన్‌రావు, పొందర కృష్ణారావు, నిమ్మన ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునరుద్ధరణకు కనకరాజు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైష్ణవి వీధిలోని కామాక్షి ఆలయ పునరుద్ధరణకు డాక్టర్ అరికతోట కనకరాజు, ఉమ దంపతులు రూ.5వేలు ఆలయ ధర్మకర్త శృంగవరపు మన్మధరావుకు అందజేశారు. ఈ ఆలయం చాలా పురాతనమైనది. స్నేహితులు, చుట్టుపక్కల నివాసితుల నుంచి నిధులను సేకరించడానికి, ఆలయాన్ని పునరుద్ధరించడానికి కమిటీ నిర్ణయించింది. ఈమేరకు ఆయన ఈ విరాళాన్ని అందజేశారు.






























- స్కిల్ కేసులో ఈడీ నోట్‌ను క్యాష్ చేసుకోలేదు
- బీజేపీ వాషింగ్ మిషిన్ నుంచి శుద్ధంగా వస్తాననే నమ్మకం
- అయినా బాబు పాత్ర నిరూపించడం అంత ఈజీ కాదు

# అందుకే ఆయన చంద్రబాబు!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**తిరుపతి లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని ఓ సింపుల్ స్టేట్‌మెంట్ పార్టీ మీటింగ్‌లో ఇచ్చి చంద్రబాబు తప్పుకున్నారు. ఆ తర్వాత సనాతన వాదం, మనుధర్మం అంటూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దాన్ని తన నెత్తినేసుకున్నారు. అయోధ్యకు వెళ్లిన తిరుపతి లడ్డూల్లో కూడా ఇదే కొవ్వు కలిసిందన్న స్టేట్‌మెంట్ ఇచ్చి, ఇప్పుడు హైదరాబాద్ సిటీ కోర్టు నోటీసులు అందు కున్నారు. మరోవైపు అభ్యుదయవాదం నుంచి సనాతనవాదానికి మారిన పవన్‌కల్యాణ్ సమాజంలో ఈ కేసు ద్వారా ఓ వర్గానికి మాత్రమే పరిమితమైపోయారు. అదే సమయంలో చంద్రబాబునాయుడు విజయవాడ వరదల్లో రాత్రీపగలు తేడా లేకుండా వయసు, ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా కష్టపడ్డారని పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు తాజాగా జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబు మీద పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్ ఇచ్చిందని అనేక మీడియాలు, టీడీపీ నాయకులు ప్రకటించారు. కానీ ఎక్కడా చంద్రబాబు మాత్రం ఈ అంశాన్ని క్యాష్ చేసుకోలేదు. ఎందుకంటే.. రాజకీయాలకు మారుపేరు చంద్రబాబు. శాశ్వత పొత్తులు, శాశ్వత ప్రభుత్వాలు ఉండవని ఆయనకు తెలుసు. అందుకే ఈడీ ఈ కేసులో ఎక్కడా చంద్రబాబు పేరు ప్రస్తావించకపోయినా, ఆయన మాత్రం తనకు క్లీన్‌చిట్ వచ్చిందని ఎక్కడా చెప్పుకోలేదు.**

సీమెన్స్, డిజైన్‌టెక్ కుంభకోణంలో చంద్రబాబు అనుకూల మీడియలో క్లీన్‌చిట్ గురించి జబర్దస్త్ ప్రచారం జరుగుతున్నప్పటికీ తెలుగుదేశం నాయకత్వం మాత్రం చాలా వ్యూహాత్మకంగా మౌనం పాటించింది. ఎలాంటి హడావిడి చేయకుండా, ఈ విషయంపై మిన్నకుండిపోయింది. పబ్లిసిటీని ఎలా వాడుకోవాలో తెలిసిన రాజకీయ నాయకుడు చంద్రబాబు విజయవాడను ముంచెత్తిన వరదల్లో మీడియాలో నిరంతరం కనిపించడానికి చేసిన ప్రయత్నం అందరికీ తెలిసిందే. అలాంటి చంద్రబాబు ఈడీ క్లీన్‌చిట్ వ్యవహారంలో మాత్రం గుంభనంగా ఉండడం విశేషం. ఈ విషయంలో ఎలాంటి లేనిపోని హడావిడి, హంగామా చేసినా 'తిరుపతి లడ్డు' కథలాగా మొదటికే మోసం వస్తుందని చంద్రబాబు భావించారు. పైగా ఈ కేసు ఏరోజు ఎటువైపు మలుపు తిరుగుతుందో, ఈడీ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎలా తిప్పుతుందో కూడా తెలియని పరిస్థితిలో మౌనం పాటించడమే మేలనుకున్నారు.

భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలోకి వచ్చాక కేంద్ర విచారణ సంస్థలైన ఈడీ, సిబిఐ, ఐటిలను ప్రత్యర్థులను లొంగదీసుకోవడానికి ఈ సంస్థలను ప్రభుత్వం వాడుకుంటోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ ఆదర్శ సహకార గృహ సొసైటీ కుంభకోణంలో నిందితుడు. ఆయన బిజెపిలో చేరగానే ఆ కేసు మూలపడి పోయింది. ఎన్సీపీకి చెందిన మహారాష్ట్ర డెప్యూటీ సిఎం అజిత్ పవార్ కోట్ల రూపాయల సహకార బ్యాంకు కుంభకోణంలో నిందితుడు. ఆయన బిజెపిలో చేరగానే ఆ కేసు అతీగతీ లేకుండా పోయింది. మన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు సిఎం రమేష్, సుజనా చౌదరిలపై ఒక్క ఈడీ మాత్రమే కాక, సిబిఐ, ఐటి సంస్థలు కూడా వెంటపడ్డాయి. వీరి మీద బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు రాజ్యసభ ఎథిక్స్ కమిటీలో ఫిర్యాదు చేసారు. వీరిని ఆంధ్రా మాల్యాలుగా పిలిచారు. కాని, వీరిద్దరూ బిజెపీలో చేరగానే వారి కేసుల విచారణ ఆగిపోయింది. ఇలాంటి పరిస్థితిలో చంద్రబాబు చక్రం తిప్పడం గాని, చాణక్య వ్యూహాలు పన్నడం గాని చేయలేరు.

**ఈడీ ప్రెస్‌నోట్‌లో ఏముంది?**

అక్టోబర్ 15న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్, డిజైన్‌టెక్ సిస్టమ్స్ ప్రతినిధులకు చెందిన 23.54 కోట్ల రూపాయల ఆస్తులను హైదరాబాద్‌లో అటాచ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి) కుంభకోణం కేసులో భాగంగా ఇది జరిగింది. ఇదే కేసులో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2023లో 53 రోజుల పాటు జైలులో ఉండవలసి వచ్చింది. (2019 ఎన్నికలలో ఓడిపోయాక ఆయన అప్పటికి ప్రతిపక్షనేతగా ఉన్నారు). 371 కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని విచారణ జరుగుతున్న కేసులో ఈడీ, ఈ కేసులో చంద్రబాబు పాత్ర ఉందని గాని, లేదని గానీ ఏమీ చెప్పలేదు. అసలు చంద్రబాబును ఉద్దేశించి ఏమీ అనలేదు. కొన్ని మీడియా సంస్థలు మాత్రం దీనిని పాజిటివ్‌గా వార్తలు సృష్టించడానికి ప్రయత్నించాయి. విచారణ సంస్థ చంద్రబాబును నిర్దోషిగా తేల్చినట్టు ప్రకటించేసాయి. జరుగుతున్న విచారణలో భాగంగా ఈడీ ఆస్తులు జప్తు చేసింది గాని, చంద్రబాబు గురించి వ్యాఖ్యానించలేదు. ఈ కేసు విచారణ ముగిసినట్టేనని ఎక్కడా ప్రస్తావించలేదు. కేసులో ఈ కీలక పరిణామం ఒక్క చంద్రబాబు నాయుడికే అర్థమైంది. భారతీయ జనతా పార్టీతో విభేదాలు ఏర్పడితే స్కిల్‌స్కామ్ కేసు ఏ మలుపు తిరగబోతుందో ఆయన అర్థం చేసుకున్నారు.

# ఇసుక ఉచితం.. షరతులు వర్తిస్తాయి!

(మొదటిపేజీ తరువాయి)

పీహెచ్ వాల్యూ సరిగ్గా ఉన్న వాటర్ క్యాన్ వేయించుకుంటున్నారు. లేదా వాటర్ ప్యూరిఫైర్ పెట్టుకుంటున్నారు.

శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెంలో ఇసుక తవ్వకాలకు అనుమతిస్తున్నారని తెలుసుకున్న స్థానికులు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు. గడిచిన ఐదేళ్లు తమ ఆరోగ్యాలతో ప్రభుత్వాలు ఆడుకున్నాయని, చివరకు వ్యవసాయం చేసుకోడానికి కూడా నది నుంచి నీరందలేదని, బోర్లు కూడా బావురుమనేటట్టు తవ్వేయడంతో పంటలు లేక, పనులు లేక నష్టపోయామని గుర్తు చేసుకుంటున్నారు. గతం చేసిన గాయం ఇంకా మానకముందే మళ్లీ కిల్లిపాలెంలో తువ్వకాలు మొదలయ్యాయి. వాస్తవానికి ఇంకా ఈ ర్యాంపునకు అనుమతులు రాలేదు. కానీ ప్రభుత్వం ఉచిత ఇసుక అనడంతో ఇక్కడకు వచ్చి చాలామంది ఇసుకను తోడుకుపోతున్నారు. ఇక అధికారికంగా ర్యాంపు ఇస్తే 16 టైర్లు కలిగివున్న లారీలకు కూడా అడ్డూ అదుపు ఉండదని స్థానికులు భయపడుతున్నారు. దీంతో వీరు మొన్న జరిగిన గ్రీవెన్స్‌కు వెళ్లి కిల్లిపాలెం ర్యాంపునకు అనుమతులివ్వొద్దంటూ మొరపెట్టుకున్నారు.

కిల్లిపాలెంకు ఆనుకొని పడమర వైపున నాగావళి ఉంటే, తూర్పువైపున ఉన్న ఇసుకను సుమారు 25 నుంచి 30 అడుగుల లోతున ఇసుక ఎత్తేయడం వల్ల తమ గ్రామానికి ఉన్న ఆనుకొని ఉన్న నాగావళి నది ప్రవహించకుండా గోతుల్లోకే నీరు వెళ్లిపోతుందని, దీని వల్ల జలకాలుష్యంతో ఇప్పటికి 500 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ఇసుకలో కూరుకుపోతున్న ప్రభుత్వ ప్రతిష్ట**

ప్రభుత్వ విధానం ఉచితమే అయినా ఇసుక తవ్వకాలే అక్రమంగా సాగుతున్నాయి. జిల్లాలో ఉచిత ఇసుక విధానం నదికి సమీపంలో ఉన్న గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల ఆదాయ వనరుగా మారిపోయింది. ప్రభుత్వ ప్రకటించిన ఉచిత ఇసుక విధానం అమల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో 12 అధికార ఇసుక రీచ్‌ల్లో నామినేషన్ పద్ధతిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నవారే ఇసుకను లారీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా తరలించుకుపోతున్నారు. స్టాక్ పాయింట్‌కు నామమాత్రంగా ఇసుకను సరఫరా చేసి రాత్రివేళలో లారీల్లో విశాఖకు అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నరసన్నపేట పరిధిలో నామినేషన్ పద్ధతిలో అధికారిక ఇసుక రీచ్‌ను నిర్వహిస్తున్నవారి అక్రమాలకు అడ్డు అదుపు లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వీరికి కొనసాగింపుగా జిల్లా అంతటా ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. ఇసుక తవ్వకాలు, తరలింపు విషయంలో టీడీపీ, వైకాపా నాయకులు ఒక్కటై వ్యాపారం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఇసుక వ్యాపారంలో మమేకమై ఉచిత ఇసుకను టీడీపీ నాయకులే అపహాస్యం చేస్తున్నారు.

**అధికారుల్లో గందరగోళం**

ప్రభుత్వం రోజుకో ఉత్తర్వు విడుదల చేస్తుండంతో అధికారుల్లోనూ గందరగోళం నెలకొంది. ఇసుకను ట్రాక్టర్లు, నాటుబండ్లు ద్వారా నది నుంచి తవ్వి తరలించుకోవచ్చని, వీరిని ఎవరైనా అధికారులు ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరించడంతో మరింత గందరగోళానికి తెర తీసింది. చంద్రబాబు ప్రకటన తర్వాత జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరందుకుంది. ట్రాక్టర్లతో ఒడ్డుకు చేర్చి లారీల్లో విశాఖకు తరలిస్తున్నారు. వైకాపా హయాంలో ఇసుక అక్రమ వ్యాపారం చేసిన వారంతా టీడీపీ నాయకులతో చేతులు కలిపి ఇసుకను లారీల్లో తరలించుకుపోతున్నారు.

**యథేచ్ఛగా రవాణా**

శ్రీకాకుళం పరిధిలో ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల చందంగా సాగుతుంది. ఇసుక అక్రమ వ్యాపారం ఎంతలా సాగుతుందంటే.. దసరా రోజున బైరి, కరజాడకు చెందిన స్థానికులు 25 ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. అప్పటి వరకు ఈ రెండు గ్రామాల్లో సుమారు 130 ట్రాకర్లు ఉన్నాయి. కొత్తగా కొనుగోలు చేసిన వాటితో కలుపుకొని సుమారు 150కి చేరాయి. ట్రాక్టర్లు కలిగిన వారంతా బృందాలుగా ఏర్పడి ఇసుకను తవ్వి ఒడ్డుకు తరలిస్తున్నారు. దీన్ని నక్క గణేష్ ద్వారా విశాఖకు లారీల్లో తరలిస్తున్నారు. ఈయన వైకాపా హయాంలో పెద్ద పెద్ద లారీలు విశాఖకు పంపడంలో ఆరితేరిపోవడంతో అక్కడ టీడీపీ నాయకులు కొందరు గణేష్‌తో చెయ్యి కలిపి లారీకి రూ.2వేలు తీసుకొని వదిలేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

నక్క గణేష్‌కు నాలుగు ట్రాక్టర్లు ఉన్నాయి. అలాగే ఇక్కడ తెలుగుదేశం మాజీ ఎంపీటీసీలకు సోదరులకు మరో రెండు ట్రాక్టర్లు ఉన్నాయి. వీటిని మాత్రమే నదిలోకి దింపి ఇసుకను లోడ్ చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మిగిలిన ట్రాక్టర్ డ్రైవర్లు నదిలోకి వెళ్లనీకుండా వీరే ట్రెంచ్‌లు తవ్వుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే శంకర్‌కు ఫిర్యాదు చేయడానికి కొందరు బయల్దేరినా ఆయన జిల్లాలో లేరని తెలిసి వెనక్కు తిరిగి వెళ్లిపోయారు.

వంశధారకు సమీపంలో ఉన్న నైరా నుంచి గార మండలం జోగిపంతులుపేట, అంబల్లవలస వరకు అనధికారికంగా ఇసుక తవ్వకాలు నిర్వహించి లారీల్లో విశాఖకు రవాణా చేస్తున్నారు. ఉచిత ఇసుక విధానంలో నాటుబండ్లు, ట్రాక్టర్లపై ఇసుక తరలించడానికి కేవలం సొంత ఇల్లు నిర్మాణం కోసమే అన్న నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. సొంత ఇంటి నిర్మాణం కోసం ఉచిత ఇసుక అవసరమైనవారు సచివాలయంలో పేరు నమోదు చేయించి ఇంటి నిర్మాణానికి అవసరమైన మేరకు ఇసుకను ట్రాక్టర్, నాటుబండిపై తరలించుకోవాలి. తరలించిన ఇసుకను స్టాక్ చేయకూడదన్న నిబంధన నూతన సాండ్‌పాలసీలో పొందుపరిచారు. ఇసుకను ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తవ్వకాలు జరిపి తరలించాలి. ఈ నిబంధనలను టీడీపీ నాయకులే తుంగలో తొక్కేశారు. సాయంత్రం ఆరు తర్వాత జేసీబీలను నదిలోకి తీసుకువెళ్లి ట్రాక్టర్లతో ఇసుకను నది ఒడ్డుకు తరలించి జేసీబీలతో అప్పటికప్పుడే లారీల్లో లోడ్ చేస్తున్నారు. ఏ రోజు తవ్విన ఇసుక ఆ రోజే లారీల్లో విశాఖకు రవాణా చేస్తున్నారు.

బట్టేరులో గతంలో సెబ్‌కు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించిన పొన్నాంకు చెందిన ప్రసన్న, గురుగు వాసు, లక్ష్మణ, కర్రి ఆదన్న ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. గార మండలం బూరవల్లి వద్ద జగన్, ఊరు పెద్దమనిషిగా చెప్పుకునే నాయుడు, ఈశ్వరరావు తవ్వేస్తున్నారు. జోగిపంతులుపేట వద్ద ముద్దపు చిరంజీవి, గోపి బ్రదర్స్ వేర్వేరు కుంపట్లు పెట్టుకొని ఇసుక తవ్వుతున్నారు. అంబళ్లవలసలో పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న సంతోష్ ఇసుక ఎత్తుతున్నాడు. నాగావళిలో కొత్తరోడ్డు వద్ద పట్టపగలే చిలకపాలెంకు చెందిన సింహాద్రి పాపారావు ట్రాక్టర్లతో తీసుకువచ్చి లారీలకు లోడ్ చేస్తున్నారు. పాపారావు గత పదేళ్లుగా ఇసుక అక్రమ రవాణా చేయడంలో ఆరితేరిపోయాడు. ప్రభుత్వం ఏదైనా ఈయన అక్రమ ఇసుక వ్యాపారానికి ఢోకా లేదు.

ఇంత పెద్ద కథలో ఎక్కడా సగటు ఇంటి నిర్మాణదారుడికి ఇసుక తక్కువ ధరకు లభించడంలేదు. ఆ మాటకొస్తే ట్రాక్టర్ ఇసుక కావాలని సొమ్ములు చెల్లించినా వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ఎందుకంటే ట్రాక్టర్లన్నీ ఇసుకను ఒడ్డుకు తెచ్చి లారీలకు అందించే పనిలో ఉన్నాయి.


# అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300, 98487 96626


## వినికిడి పరికరాలకు పేరివ్వండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉచిత వినికిడి పరికరాల కోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వం జారీ చేసిన ఆడియో మెట్రిక్ రిపోర్టు, సదరం సర్టిఫికెట్‌తో పేర్లు నమోదు చేసుకోవాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్‌తో పాటు డీఎంహెచ్‌వో బి.మీనాక్షి ఒక ప్రకటనలో కోరారు. వచ్చే నెల 8న జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఓపీ నెంబరు 27 గదిలో శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఇక్కడికి వినికిడి సమస్యతో బాధపడుతున్నవారు సంబంధిత పత్రాలతో రావాలని ఆమె సూచించారు. దీన్‌దయాల్ శ్రావణ్ ఫౌండేషన్, నేషనల్ హెల్త్ మిషన్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో 21 ఏళ్ల లోపు వయసున్నవారికి ఉచితంగా వినికిడి పరికరాలు అందిస్తామన్నారు.

## విద్యుత్ హెల్ప్‌లైన్ నెంబర్లు ఇవే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దానా తుపాను కారణంగా ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కావచ్చని, ఇందు కోసం ప్రత్యేకమైన హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటుచేసినట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం డివిజన్‌కు 94906 10045, టెక్కలి డివిజన్‌కు 83328 43546, పలాస డివిజన్‌కు 73825 85630 నెంబర్లు ఇచ్చామని, ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో లోపాలు, విద్యుత్ స్తంభాలు పడిపోవడం, వైర్లు వేలాడటం, లేదా నేలను తాకడం లాంటివి జరిగితే ఈ నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని ఆ ప్రకటనలో కోరారు. తుపాను ప్రభావిత ప్రాంతంలో పునరుద్ధరణ చర్యలు చేపట్టాల్సి వస్తే 255 మంది వర్క్‌మెన్లు, 15 వాహనాలు, 13 క్రేన్‌లు, 6 పోల్ డ్రిల్లింగ్ మిషన్లు, 30 చెట్లు తొలగించే పవర్ రంపాలతో పాటు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సెల్ టవర్స్ వద్ద జనరేటర్లు సిద్ధంగా ఉంచినట్లు ఆయన తెలిపారు.

## రేపటికి తీవ్ర తుపానుగా 'దానా'..!

- గంటకు 15 కి.మీ వేగంతో ముందుకు -

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను రేపటికి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాములోపు తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. పూరీ (ఒడిశా), సాగర ద్వీపం (పశ్చిమబెంగాల్) మధ్య భితార్కానికా, ధమ్రా సమీపంలో తీరం దాటనున్నట్లు పేర్కొంది. గడిచిన 6 గంటల్లో తుపాను గంటకు 15 కి.మీ వేగంతో ముందుకు కదులుతోందని తెలిపింది. ప్రస్తుతం పరదీప్ (ఒడిశా)కి 520కి.మీ., సాగర్ ద్వీపానికి 600 కి.మీ, ఖేపుపరా (బంగ్లాదేశ్)కి 610 కి.మీ దూరంలో దానా తుపాను కేంద్రీకృతమైనట్లు వెల్లడించింది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని తీర ప్రాంతం వెంబడి గంటకు 80-100కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. బుధ, గురువారాల్లో సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు.

## రైల్వేస్టేషన్లలో టోల్‌ఫ్రీ ఏర్పాటు




(సత్యంన్యూస్, ఆమదాలవలస)

దానా తుపాను కారణంగా ఈ నెల 24, 25 తేదీల్లో పలు రైళ్లు రద్దు కావడం వల్ల ముందుజాగ్రత్త చర్యగా శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) స్టేషన్‌లో రైల్వే అధికారులు టోల్‌ఫ్రీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. తూర్పుకోస్తా రైల్వే పరిధిలో దూరప్రాంత సర్వీసులతో సహా దగ్గరి సర్వీసులు నడిచే రైళ్లు రద్దయ్యాయి. గురువారం అత్యధికంగా 37 సర్వీసులను రద్దు చేశారు. ఇందులో ఎక్కువగా హౌరా, భువనేశ్వర్, ఖరగ్‌పూర్, పూరీ తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేవి ఉన్నాయి. అలాగే విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య నడిచే వందేభారత్ రైలును 24న రద్దు చేశారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.